క్లుప్తంగా

ఘనంగా జాతీయ గణాంక శాస్త్ర దినోత్సవం



ఆచార్య శ్రీనివాసరావును సత్కరిస్తున్న కళాశాల అధ్యాపకులు

ఎంవీపీకాలనీ : గాయత్రీ విద్యాపరిషత్ కళాశాలలో జాతీయ గణాంకశాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డే ఫర్ డెసిషన్ మేకింగ్ అనే అంశంపై జరిగిన ఈ కార్యక్రమంలో ఏయూ సైన్స్ కళాశాల మాజీ ప్రిన్సిపల్, గణాంకశాస్త్ర నిపుణుడు ఆచార్య కె.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డేటా విశ్లేషణ నైపుణ్యాలను విద్యార్థులు సొంతం చేసుకోవాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో స్టాటస్టిక్స్ విద్యార్థులు డేటా ఎనలిటికల్ స్కిల్స్‌లో ప్రత్యేక శ్రద్ధ వహించి జాబ్ మార్కెట్ రంగంలో ఉన్నతంగా స్థిరపడి జాతీయాభివృద్ధికి కృషిచేయాలన్నారు. అనంతరం ఆయనను కళాశాల ప్రతినిధులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కేఎస్ బోస్, స్టాటస్టిక్స్ విభాగాధిపతి డాక్టర్ పి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ అభివృద్ధికి సహకారం



మాట్లాడుతున్న అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్

ఎంవీపీకాలనీ: విశాఖపట్నం అభివృద్ధికి తాను పూర్తి సహకారం అందిస్తానని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం ఆయన పార్టీ కార్యకర్తలు, ముఖ్యనాయకులతో లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను అనకాపల్లి ఎంపీని అయినప్పటికీ విశాఖ అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకారం అందిస్తానన్నారు. విశాఖ నగరానికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయం అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన నిర్వహించనున్నారు.

ఏళ్లనాటి సమస్యలకు పరిష్కారం



నాడు: పల్లంగా ఉన్నప్పుడు సూర్యతేజానగర్ వద్ద రోడ్డుపై చేరిన వర్షం నీరు



నేడు : సూర్యతేజానగర్- అంబేడ్కర్‌నగర్ మధ్య ఇటీవల కొత్తగా నిర్మించిన రోడ్డు, బ్రిడ్జి

- రహదారులకు మోక్షం
- గత ప్రభుత్వం హయాంలో రూ.కోట్లాది నిధులతో నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో ఏళ్లనాటి సమస్యలు పరిష్కారమయ్యాయి. వర్షం పడితే నీటితో నిండిపోయే రోడ్లుకు మోక్షం కలిగింది. బీఆర్‌టీఎస్ రోడ్డు నుంచి ఆరిలోవ లోపలకు వెళ్లడానికి రెండు చోట్ల ప్రధాన రహదార్లు ఉన్నాయి. ఆయా రెండు రహదార్ల మధ్యలో పెద్ద గెడ్డ అడ్డంగా ఉంది. సుమారు మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఇరుకైన వంతెనలు ఉండేవి. ప్రస్తుతం వాహన రాకపోకలు రద్దీ పెరగడంతో ఆ వంతెనలు వాహనచోదకులకు ఇబ్బందిగా మారేది. దీంతో పాటు పల్లంగా ఉండటంతో చిన్నపాటి వర్షానికి సైతం వాటిపై వర్షం నీరు చేరిపోయేది. దీంతో వాహనచోదకులు నానా తంటాలు పడాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ సమస్యలు తీరిపోయాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి చొరవతో ఆయా చోట్ల అభివృద్ధి పనులు జరిగాయి. రూ.కోట్లతో రోడ్లు, వంతెనలు నిర్మించారు. దీంతో ఆరిలోవ, పెదగదిలి, చినగదిలి ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చినగదిలి–సూర్యతేజానగర్‌లో..

బీఆర్‌టీఎస్‌ను ఆనుకొని చినగదిలి సాయిబాబా గుడి నుంచి సూర్యతేజానగర్ మీదుగా అంబేడ్కర్ నగర్ వైపు వెళ్లే 20 అడుగులు వెడల్పు గల సుమారు 400 మీటర్ల పొడవున 60 నుంచి 80 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మించారు. దీని కోసం రూ.2.35 కోట్లు నిధులు ఖర్చు చేశారు. ఇక్కడ డబుల్ రోడ్డు నిర్మించి, సెంట్రల్ లైటింగ్, ఇరు పక్కలా పాత్ వేలు ఏర్పాటు చేశారు. ఈ రోడ్డు చివరన ఉన్న చిన్న వంతెన తొలగించి మరో రూ.3 కోట్లతో 80 అడుగులకు విస్తరించి కొత్తగా నిర్మించారు. దీంతో ఇక్కడ సమస్య పరిష్కారమైంది. ఎంత వర్షం కురిసినా వాహనచోదకులు ఎలాంటి ఇబ్బందిలేకుండా ప్రయాణిస్తున్నారు.

రూ.7 కోట్లతో..

బీఆర్‌టీఎస్‌ను ఆనుకొని పెదగదిలి కూడలి నుంచి తోటగరువు వెళ్లే ప్రధాన రహదారి ఇరుకుగా ఉండేది. ఈ రహదారి మధ్యలో గెడ్డపై ఇరుకుగా ఉండే వంతెన ఉండేది. చిన్నపాటి వర్షానికి వరద నీరు చేరిపోయేది. వర్షం కురిసినప్పుడు దీనిపై ప్రయాణించే వాహనచోదకులు ఇబ్బందిపడేవారు. దీనికి కూడా ఈ ఏడాది మోక్షం లభించింది. సుమారు రూ. 7 కోట్లతో ఇక్కడ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి జీవీఎంసీ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో భాగంగా శిథిలమైన ఇరుకు వంతెన తొలగించింది. దాని స్థానంలో మొత్తం నిధుల్లో రూ.3 కోట్లతో సుమారు 80 అడుగుల వెడల్పు గల వంతెన ఆగమేఘాలపై కొత్తగా నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ బ్రిడ్జి నిర్మాణం ఇటీవల పూర్తయింది. పెదగదిలి కూడలి నుంచి బ్రిడ్జి మీదుగా ఎర్నిదుర్గమాంబ ఆలయం వరకు రోడ్డు కూడా జీవీఎంసీ అధికారులు నిర్మించారు. మిగిలిన డబుల్ రోడ్డు (పెదగదిలి నుంచి తోటగరువు, బాలాజీనగర్, అంబేడ్కర్‌నగర్ వరకు) నిర్మాణం జరగాల్సి ఉంది. ప్రస్తుతం ఈ రహదారిలో గెడ్డపై బ్రిడ్జి నిర్మాణం పూర్తవడంతో వాహనచోదకులు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణం సాగిస్తున్నారు.



నాడు : గతంలో వర్షం నీరు చేరి పెదగదిలి, తోటగరువు మధ్య గెడ్డపై వంతెన



నేడు : పెదగదిలి, తోటగరువు మధ్య ఇటీవల కొత్తగా నిర్మించిన బ్రిడ్జి, రహదారి

బల్లిగిరికి పోటెత్తిన భక్తులు



విశేష అలంకరణలో బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం: బల్లిగిరి వెంకటేశ్వరమెట్ట దేవస్థానానికి శనివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచి స్వామి వారికి ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా భక్తుల గోత్రనామాలతో సహస్ర నామాభిషేకాలు, అష్టోత్తర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

ప్లాటినం ఆభరణాలకు పెరుగుతున్న డిమాండ్

బీచ్‌రోడ్డు: భారతదేశంలోని యువత ప్లాటినం ఆభరణాలను ధరించేందుకు ఆసక్తి చూపుతున్నారని ప్లాటినం గిల్డ్ ఇంటర్నేషనల్ ఇండియా డైరెక్టర్ పల్లవి తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో శనివారం రిటైల్ భాగస్వాములతో మీడియా సమావేశం నిర్వహించారు. మెటల్ ఆఫ్ లవ్ అని పిలవబడే ప్లాటినం, ప్రేమ ఐక్యతకు సంబంధించిన ఉంగరాలు (త్రీ స్టోన్, ట్రినిటీ), లవ్ బ్యాండ్‌లు యువతను ఎక్కువగా ఆకర్షిస్తున్నాయన్నారు. వారి అభిరుచులకు తగ్గట్లు డిమాండ్‌కు సరిపడే ఆభరణాలను అందుబాటులోకి తీసుకొని వచ్చేందుకు ఈ రిటైల్ భాగస్వాములతో సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు.

దంతేవాడ-కమ్లూర్ సెక్షన్‌లో పనులు పూర్తి

- సెక్షన్‌లో రైల్వే సేఫ్టీ కమిషనర్ తనిఖీలు
- పరీక్షలు, స్పీడ్ ట్రయల్ విజయవంతం

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో కీలకంగా ఉన్న డబ్లింగ్ లైన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పూర్తయిన పనులను ఉన్నతాధికారులు వెంటవెంటనే తనిఖీలు కూడా చేస్తున్నారు. వాల్తేర్ డివిజన్ పరిధిలో నూతనంగా నిర్మించిన దంతేవాడ- కమ్లూర్ డబ్లింగ్ పనులు పూర్తయ్యాయి. ఈ మార్గంలో శనివారం రైల్వే సేఫ్టీ(ఈస్ట్రన్ సర్కిల్) కమిషనర్ సువోమోయ్ మిత్ర, డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పరీక్షించారు. అత్యాధునిక భద్రతా ప్రమాణాలతో ఈ తనిఖీలు చేపట్టారు. దంతేవాడ-కమ్లూర్ స్టేషన్‌ల మధ్య మోటార్ ట్రాలీలపై ట్రాక్ అసెస్‌మెంట్స్, రైల్వే స్టేషన్స్, నూతన సిగ్నలింగ్ వ్యవస్థ, దంతేవాడ వద్ద దంకిని నదిపై నూతనంగా నిర్మించిన బ్రిడ్జిలను పరిశీలించారు.



దంతేవాడ-కమ్లూర్ సెక్షన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న రైల్వే సేఫ్టీ కమిషనర్ సువోమోయ్ మిత్ర

రవాణా మరింత వేగవంతం

స్పీడ్ ట్రయల్ కూడా విజయవంతంగా పూర్తయినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. సవాళ్లు, ప్రతికూల పరిస్థితుల్లో ఈ రెండో లైన్‌ను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ డబ్లింగ్ లైన్ వల్ల ఛత్తీస్‌ఘడ్-ఆంధ్రప్రదేశ్ మధ్య రవాణా మరింత వేగవంతం కానుంది. బైలడిల్ల నుంచి విశాఖపట్నం పోర్ట్‌లకు ఇనుప ఖనిజం రవాణా మరింత వేగంగా, ఎక్కువగా సాగనుంది. పర్యటనలో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(కన్‌స్ట్రక్షన్) ఎస్.శ్రీనివాస్, ఏడీఆర్ఎం(ఇన్‌ఫ్రా) సుధీర్ కుమార్ గుప్తా, చీఫ్ ఇంజినీర్(కన్‌స్ట్రక్షన్) డి.శ్రీనివాసరావు, ఇతర డివిజనల్ ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొన్నారు.



మోటార్ ట్రాలీపై పరీక్షలు చేస్తున్న అధికారులు

తిరుపతికి కుర్తాళం పీఠాధిపతి

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో గురువుల ఆరాధనోత్సవాలు శుక్రవారంతో ముగియడంతో శనివారం ఉదయం కుర్తాళం పీఠాధిపతి జగద్గురు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి, శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతి స్వామిని తిరుపతికి పయనమయ్యారు. అక్కడ నుంచి వారణాశికి తరలివెళ్లి సిద్ధేశ్వరి పీఠంలో కొద్ది రోజుల పాటు స్వామీజీ వివిధ పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

50 లక్షల మొక్కలు నాటి పెంచండి



పూలు, ఔషధ మొక్కలతో విద్యార్థులు

సీతమ్మధార: విశాఖలో 50 లక్షల మొక్కలు నాటి, వాటిని పెంచి, 5 వేల టన్నుల ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేద్దామని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం పిలుపునిచ్చారు. సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో శనివారం ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ విజయకుమార్‌కు గ్రీన్ క్లైమేట్ టీం ఔషధ మొక్కలు, పువ్వుల మొక్కలను అందజేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన బంతులతో విశాఖను హరిత వనం చేద్దామన్నారు. ప్రిన్సిపాల్ విజయకుమార్ మాట్లాడుతూ భూగోళం మీద సమస్త జీవరాశిని కాపాడాల్సిన బాధ్యత మానవాళిదేనన్నారు. ప్రకృతి ఆధారిత పంటల ఆహారాన్నే ఆరగించాలని సూచించారు. జీవీఎంసీ ఎస్ఆర్‌యూ ప్రతినిధి అక్షత మాట్లాడుతూ విశాఖలో అమలవుతున్న ఎకో వైజాగ్‌లో భాగంగా మొక్కలు నాటి, పెంచే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం స్కూల్ ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌యూ ప్రతినిధులు ప్రమీల, వివేక్, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ టీచింగ్ ఫ్యాకల్టీ శివలక్ష్మి, జోషఫ్ నవీనా, బి.జ్యోతి, ఫర్హానా బేగం పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ విజయకుమార్

గిరిప్రదక్షిణకు రహదారుల ముస్తాబు

తాటిచెట్లపాలెం: గురుపౌర్ణమిని పురస్కరించుకుని ప్రారంభం కానున్న గిరిప్రదక్షిణ కోసం జీవీఎంసీ ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తోంది. గిరిప్రదక్షిణ చేసే భక్తుల సౌకర్యార్థం, వారు నడిచే రహదారులను బాగుచేస్తున్నారు. స్టేడియం వెనుక వైపు గల రహదారులను శుభ్రపరుస్తున్నారు. రోడ్డుకిరువైపులా గల ముళ్లపొదలు, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. 45వ వార్డులోని సాలగ్రామపురం, వరాహగిరి కాలనీ, సత్యసాయినగర్, సింహగిరి కాలనీ, సింగాలమ్మపురం కొండవాలు ప్రాంతాల్లో శనివారం దారిపొడువునా రహదారిని వెడల్పు చేస్తూ, విశాలంగా చేశారు. జీవీఎంసీ జోన్-5 ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, సూపర్‌వైజర్ లీలాప్రసాద్, మేస్త్రీ సుభాన్‌లు పనులను పర్యవేక్షించగా, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

రాజీమార్గమే ఉత్తమం



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న న్యాయమూర్తి షణ్ముఖరావు

గాజువాక : కక్షిదారులు తమ కేసులను పరిష్కరించుకోవడానికి రాజీమార్గాన్ని అనుసరించడం ఎంతో ఉత్తమమని 13వ అదనపు జిల్లా జడ్జి షణ్ముఖరావు అన్నారు. గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో జాతీయ లోక్ అదాలత్ శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంతాలకు పోయి కోర్టుల చుట్టూ తిరగడం వల్ల సమయంతో పాటు ఆర్థికంగా కూడా చాలా ఇబ్బంది పడాల్సిన పరిస్థితులు తలెత్తుతాయన్నారు. రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల ఈ ఇబ్బంది తగ్గుతుందని, కక్షిదారుల మధ్య మంచి సంబంధాలు ఉంటాయని అన్నారు. లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవడానికి వచ్చిన కక్షిదారులను ఈ సందర్భంగా అభినందించారు.

5 బెంచీల్లో 178 కేసుల పరిష్కారం

కోర్టు కాంప్లెక్స్‌లో నిర్వహించిన లోక్ అదాలత్ శిబిరంలో కక్షిదారుల మధ్య రాజీ కుదర్చడం ద్వారా న్యాయమూర్తులు 178 కేసులను పరిష్కరించారు. 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.షణ్ముఖరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్, మోటార్, యాక్సిడెంట్, బీమా తదితర రూ.5.42 కోట్ల విలువైన కేసులను పరిష్కరించినట్లు కోర్టువర్గాలు తెలిపాయి. ఈ శిబిరంలో న్యాయమూర్తులు ఐదు బెంచీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఇ.రాజేంద్రబాబు, వి.పల్లవి, వై.శ్రీలక్ష్మి, పి.ప్రదీప్, కార్యవర్గ సభ్యులు బి.ప్రభాకరరావు, పి.పుల్లయ్య నాయుడు, ఏపీపీ వాణి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్పించాలంటూ ర్యాలీ



బ్యానర్లతో ర్యాలీ చేపడుతున్న విద్యార్థులు, ఎంఈవో, ఉపాధ్యాయులు

ఆరిలోవ: విద్యా శాఖాధికారులు ఐదేళ్లలోపు పిల్లలందర్నీ బడికి పంపించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాలల పరిధిలో ర్యాలీలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా శనివారం జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి ఆరిలోవ ఆఖరి బస్‌స్టాప్ వద్ద ఆపరేషన్‌కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను చినగదిలి ఎంఈవో-1 సీహెచ్.రవీంద్రబాబు సందర్శించారు. ఇక్కడ ఎంతమంది పిల్లలు ఉన్నారో హెచ్ఎం ద్వారా తెలుసుకొన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, పిల్లలతో కలిసి పాఠశాల సమీపంలో కాలనీలో బ్యానర్లు పట్టుకొని ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఐదేళ్లు దాటిన పిల్లల్ని తల్లిదండ్రులు తప్పనిసరిగా బడిలో చేర్పించాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు ఉన్నాయన్నారు. ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫారంతో పాటు మధ్యాహ్నభోజనం అందిస్తున్నారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు అన్ని వసతులతో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తయారయ్యాయన్నారు. ర్యాలీలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆసరాగా..



నిత్యావసర సరుకులు అందజేస్తున్న సేవా స్ఫూర్తి సభ్యులు

ఆరిలోవ: అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాన్ని సేవా స్ఫూర్తి సంస్థ ఆదుకుంది. ప్రతి నెలా నిత్యవసర సరుకులు ఇవ్వడానికి ముందుకు వచ్చింది. జీవీఎంసీ పదో వార్డు పరిధి తోటగరువు దరి బీఎస్‌ఆర్ నగర్‌లో బోని లక్ష్మి, ఆమె భర్త, చిన్నపాప నివాసముంటుంది. మతిస్థిమితం లేని ఆమె అన్నయ్య కూడా వారి వద్దే ఉంటున్నాడు. లక్ష్మి, ఆమె భర్త కూలి పనులు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కొన్నాళ్లుగా లక్ష్మి తీవ్ర అనారోగ్యానికి గురైంది. దీంతో పాటు చిన్న పాప, మతిస్థిమితంలేని ఆమె అన్నయ్యకు సేవలు చేయడానికి లక్ష్మి భర్త కూలి పనులకు కూడా వెళ్లలేకపోతున్నాడు. దీంతో వారి కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందిపడుతోంది. ఈ విషయం తెలుసుకొన్న రవీంద్రనగర్‌లో ఉన్న సేవా స్ఫూర్తి సంస్థ ఆ కుటుంబానికి చేయూత ఇవ్వడానికి ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా శనివారం ఒక నెలకు సరిపడగా ఆ కుటుంబానికి అవసరమైన నిత్యవసర సరుకులు అందించింది. దీంతో లక్ష్మి, ఆమె భర్త సేవా స్ఫూర్తి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు ఒమ్మి అప్పలరాజు మాట్లాడుతూ లక్ష్మి కుటుంబానికి ప్రతి నెలా నిత్యవసర సరుకులు అందిస్తామన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను పక్కాగా గుర్తించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మొదటి విడతగా 73 కేసులను గుర్తించామన్నారు. కుష్టువ్యాధి నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందిని వినియోగించుకుని కచ్చితమైన కేసులను గుర్తించాలన్నారు. జిల్లా లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు కుష్టువ్యాధిపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఆశ కార్యకర్తలు, వలంటీర్ల ద్వారా పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.సత్యవేణి, నోడల్ అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. అప్పన్న నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో తలంబ్రాలు ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు కనులపండువగా జరిగాయి. అందులో భాగంగా ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై అధిష్టింపజేశారు. అనంతరం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలు, అక్షింతలను అందజేశారు.

ఘనంగా సహస్ర నామార్చన

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి శనివారం సహస్ర నామార్చన ఘనంగా జరిగింది. ఉత్సవ మూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై కొలువుదీర్చి, 1001నామాలను పఠిస్తూ స్వామి వారికి అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి తులసి ప్రసాదం అందజేశారు.

6 అడుగుల నాగజెర్రి పట్టివేత



నాగజెర్రిపామును పట్టుకున్న స్నేక్‌క్యాచర్ సురేష్

పెదగంట్యాడ: నెల్లిముక్కులోని ఎంపీపీ పాఠశాల వద్ద 6 అడుగుల నాగజెర్రిని స్నేక్ సేవర్ సొసైటీ ప్రతినిధి శనివారం సాయంత్రం పట్టుకున్నారు. వివరాలివి.. పాఠశాలలోని బాత్రూంలోకి దూరిన నాగజెర్రి, తర్వాత బయటికి రావడంతో, అక్కడున్న విద్యార్థులు గమనించి, భయంతో గట్టిగా కేకలు వేశారు. అక్కడే ఉన్న ఎంఈవో రమణాజీ వెంటనే స్నేక్ సేవర్ సొసైటీకి సమాచారం ఇచ్చారు. వెంటనే సొసైటీ ప్రతినిధి సురేష్ అక్కడికి చేరుకుని, దానిని చాకచక్యంగా పట్టుకున్నారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఎక్కడైనా పాము కనిపిస్తే దానికి ఎలాంటి ప్రమాదం తలపెట్టకుండా వెంటనే స్నేక్ సేవర్ సొసైటీకి 88663 68899 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు.